సామాజిక రుగ్మతల నివారణ కోసం పోలీసు శాఖ ధూంధాం

బేల, మార్చి 18 : ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని సిర్సన్న గ్రామంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు కళాకారులచే సామాజిక రుగ్మతల నివారణ కోసం ధూంధాం కార్యక్రమం నిర్వహించారు. సామాజిక రుగ్మతల వలన కలిగే నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా పోలీస్ కళాకారులు, బేల ఎస్ఐ దివ్య భారతి మాట్లాడుతూ ఇటీవల కాలంలో మహిళలు పిల్లలను టార్గెట్ చేసుకొని సైబర్ నేరాలు పెరుగుతున్నాయని అన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఏటీఎం, పిన్ నెంబర్, సీవీవీ, బ్యాంకు ఖాతా వివరాలు కోరితే ఇవ్వరాదన్నారు. ఎలాంటి ఆపద సమయంలో సైబర్ నేరాలపై టోల్ ఫ్రీ నంబర్ 1930కి లేదా 100కు ఫోన్ చేసి పోలీసులు, ఇతర శాఖల యంత్రాంగం సేవలు పొందాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎల్టీ కిష్టా రెడ్డి, మల్లారెడ్డి, సురేశ్‌రెడ్డి, దీపక్ గౌడ్, రూపేశ్ పాల్గొన్నారు.

చేతి పంపుకు సన్మానం

చేతి పంపును సన్మానిస్తున్న కాలనీవాసులు

బోథ్, మార్చి 18: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని మైసమ్మ కాలనీలో 1995లో నీటి సమస్య నివారణకు ప్రభుత్వం బోరుబావి తవ్వించింది. దానికి చేతి పంపు అమర్చారు. అప్పటి నుంచి నేటి వరకు కాలనీతోపాటు చుట్టూ పక్కల కాలనీవాసుల దాహార్తి తీరుస్తుంది. దీంతో కాలనీవాసులు చేతి పంపునకు ప్రత్యేక పూజలు చేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అంజన రాము, పాలిక్ రమేశ్, నవీన్, భోజన్న, అల్లాడి శేఖర్, ప్రకాశ్, కిషన్, గంగాధర్, నహీం, కమల, భాస్కర్, రాజు పాల్గొన్నారు.

కలెక్టర్ శ్రద్ధతో పాఠశాలకు మరో ఉపాధ్యాయుడు

తాంసి(భీంపూర్), మార్చి 18: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని అంతర్గాం యూపీఎస్‌లో 80 మంది విద్యార్థులకు గాను ఇద్దరు ఉపాధ్యాయులున్నారని బీఆర్ఎస్ నాయకులు ఇటీవల కలెక్టర్‌కు విన్నవించారు. దీంతో కలెక్టర్ ఈ పాఠశాలకు మరో ఉపాధ్యాయుడిని నియమించాలని డీఈవోను ఆదేశించారు. దీంతో భీంపూర్ మండలంలోని కామట్‌వాడ పాఠశాల నుంచి శ్రీనివాస్ అనే ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై అంతర్గాంకు పంపారు. మంగళవారం ఆయన విధుల్లో చేరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఉట్నూర్, మార్చి18: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన ఉట్నూర్‌మండలంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ప్రయాణికుల వివరాల ప్రకారం...జైనూర్ మండలానికి చెందిన బక్కు(46) ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి గ్రామ సమీపంలో జరిగిన ఓ శుభకార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం బైక్‌పై తిరుగు ప్రయాణంలో మారుతిగూడ సమీపంలో ఎదురుగా బైక్‌లు ఢీ కొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో బక్కుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

ఇచ్చోడ నర్సరీ పరిశీలన

ఇచ్చోడ, మార్చి 18: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో ఏర్పాటు చేసిన నర్సరీని మంగళవారం ఎంపీడీవో లక్ష్మణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా ఉదయం, సాయంత్రం నీరు పోయాలన్నారు. ఆయన వెంట సంబంధిత మండల అధికారులు ఉన్నారు.

ఉట్నూర్: పోలీస్ స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

నర్సాపూర్(జీ): బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

నిర్మల్ అర్బన్, మార్చి 18: రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వగా నిర్మల్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో స్థానిక బస్టాండ్ వద్ద పోలీసులు అరెస్ట్ చేసి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు వెళ్తున్న నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని అన్నారు. అరెస్టు అయిన వారిలో నాయకులు పూదరి బిట్టు, రిజ్వాన్, చందుల చరణ్ ఉన్నారు.

కడెం, మార్చి 18 : కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి కడెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు. అరెస్టు అయిన వారిలో పార్టీ యూత్ మండలాధ్యక్షుడు కమ్మల స్వామి, నాయకులు కల్వకుంట నరేశ్, చిట్యాల రవి, షేక్ అతిక్, పందిరి సుదన్ ఉన్నారు.

నర్సాపూర్ (జీ), మార్చి 18 : హైదరాబాద్‌లో జరిగే అసెంబ్లీని ముట్టడించే నేపథ్యంలో నర్సాపూర్(జీ) మండల బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ నర్సాపూర్ (జీ) మండల ప్రెసిడెంట్ తోడిశెట్టి సుదన్, యువ నాయకులు ప్రశాంత్, మండల నాయకులు ఉన్నారు.

బీఆర్ఎస్వీ నాయకులు..

ఉట్నూర్, మార్చి 18 : ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ధర్నాలు, నిరసనలు నిషేధిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపడుతూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్‌తో పాటు నాయకులు ముజీబ్, క్రాంతి, బాబా శ్యాం, సాజీద్, పొన్నం సాయి, సుమన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దుర్మార్గపు పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటువంటి అరెస్ట్‌లకు భయపడమన్నారు.

బాసర, మార్చి 18 : బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో ముథోల్ నియోజక వర్గ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోర్వాక్యామ్, నాయకులు దత్తపురం రవి, సాయికృష్ణ, ఎస్‌కే వాజీద్ ఉన్నారు.

ఖానాపూర్ టౌన్, మార్చి 18: బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి సస్పెన్షన్, ఉస్మానియా యూనివర్సిటీపై విధించిన అంక్షలను ఎత్తివేయాలని చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్తున్న బీఆర్ఎస్వీ నాయకులను ఖానాపూర్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్వీ నాయకులు సుద్దాల మహిపాల్, సల్ల వంశీ, లాజర్, సాయికృష్ణ, ప్రణీత్ ఉన్నారు.

నిర్మల్‌అర్బన్: పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు

కడెంలో..

బాసర: అరెస్టు అయిన బీఆర్ఎస్వీ నాయకులు

ఖానాపూర్‌లో..

ఐదుగురిపై కేసు నమోదు

ఎదులాపురం, మార్చి 18: యువత గంజాయి మత్తు బారిన పడకుండా తల్లిదండ్రులు వారిపై శ్రద్ధ వహించాలని డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇద్దరు గంజాయి అమ్మేవారు, ఒక గంజాయిని పండించే వాడు, ఇద్దరు గంజాయి సేవించే వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 35 గ్రాముల గంజాయి, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన కృష్ణపల్లి వంశీ, కృష్ణపల్లి మల్లేశ్ (గంజాయి వ్యాపారస్తులు) ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లింగుగూడ గ్రామానికి చెందిన కుమురు మహదు(గంజాయి పండించే వ్యక్తి), ఆదిలాబాద్‌లోని శాంతినగర్‌కు చెందిన అలాల్ తిరుమలేశ్, తుల్జాపూరి అజయ్(గంజాయి సేవించే వ్యక్తి)పై ఆదిలాబాద్ వన్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని తెలిపారు. సమావేశంలో ఒకటవ పట్టణ సీఐ సునీల్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్ఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోకు స్కోచ్ జాతీయ అవార్డు

ఉట్నూర్, మార్చి18: గిరిజనులకు చేస్తున్న సేవలు మెచ్చి ఢిల్లీకి చెందిన స్కోచ్ గ్రూప్ ఎండీ దీపక్ దలాల్ ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు స్కోచ్ జాతీయ అవార్డుకు ప్రకటించారు. ఈ నెల 29వ తేదీన ఢిల్లీలో జరిగే కోచ్ సమ్మిట్ సమ్మేళన వేడుకల్లో పీవోకు ఈ అవార్డును అందించనున్నట్లు పేర్కొన్నారు. పీవో కష్టానికి ఈ అవార్డు అందడంతో గిరిజన సంఘాలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మండల స్థాయి పైలెట్ ప్రజావాణి ప్రాజెక్ట్ అమలుపై అవగాహన

ఎదులాపురం, మార్చి 18: మండల స్థాయి పైలెట్ ప్రజావాణి ప్రాజెక్ట్ అమలుపై సంబంధిత జిల్లా , ప్రిసైడింగ్ అధికారులకు కలెక్టర్ రాజర్షి షా మంగళవారం జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో అవగాహన కల్పించారు. ఫిర్యాదుల పరిష్కార అధికారులు, ఐఎఫ్‌సీ డేటా ఎంట్రీ ఆపరేటర్‌తో రిప్రెషర్ శిక్షణ నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, జడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ కలెక్టర్‌కు స్కోచ్ అవార్డు

ఎదులాపురం, మార్చి 18: ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్కోచ్ అవార్డుకు ఎంపికయ్యారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో అమలు చేస్తున్న ఆరోగ్య పాఠశాల నిర్వహణలో భాగంగా ఆయనకు ఈ అవార్డు లభించింది. ఈ నెల 29వ తేదీన ఢిల్లీలో నిర్వాహకులు అవార్డును అందజేయనున్నారు.

మహారాష్ట్ర మహిళా రైతు ఆత్మహత్య

ఎదులాపురం, మార్చి 18 : పత్తి పంట దిగుబడి రాలేదని పురుగుల మందు తాగి మహారాష్ట్రకు చెందిన మహిళా రైతు మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ తాలూకా కొఠారి గ్రామానికి చెందిన మహిళా రైతు రాథోడ్ జాముబాయి(55) తనకున్న నాలుగెకరాల్లో పత్తి సాగు చేసింది. భారీ వర్షం వల్ల దిగుబడి రాలేదు. దీంతో దిగులు చెంది చేసిన అప్పులు తీర్చలేక ఈనెల 16వ తేదీన పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మహారాష్ట్ర నుంచి చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఆమె కుమారుడు రాథోడ్ ఈశ్వర్ ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఏఎస్సై ఎన్.ముకుంద్ రావు తెలిపారు.

విద్యుత్ అంతరాయానికి చర్యలు

దస్తురాబాద్, మార్చి 18: వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా కృషి చేస్తున్నామని ఇన్‌చార్జి విద్యుత్ శాఖ ఏడీఏ, ఏఈ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం బుట్టపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చెన్నూర్ 11 కేవీ సబ్ స్టేషన్‌లో కొత్తగా అమర్చిన వీసీబీని ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశల సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం, మార్చి 18 : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చలు జరిపి పరిష్కారం కోసం కార్యాచరణ రూపొందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నాయకులు మంగళవారం ఆదిలాబాద్‌లోని కార్యాలయంలో డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, డిప్యూటీ డీఎంహెచ్‌వోను కలిసి ఆశల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశలకు రూ.18వేలు కనీస వేతనం, పీఎఫ్ ,ఈఎస్ఐ, పింఛన్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశలకు మేనిఫెస్టోలో చేర్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు నిర్వహించడానికి ఆశలు సిద్ధం గా ఉన్నారని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి సుజాత, నాయకులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో, డిప్యూటీ డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

తాంసి, మార్చి 18: విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి బీ సౌజన్య అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సంబంధించిన చట్టాలు, హక్కులు, వివిధ న్యాయ వ్యవస్థల గురించి వివరించారు. ముఖ్యంగా బాలల హక్కులు, బాల్య వివాహ నిషేధ చట్టం, పిల్లల రక్షణ చట్టాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ హక్కులను గురించి తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా న్యాయ సంబంధిత అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం రైతు వేదికలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా, చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, పంచాయతీ కార్యదర్శి నరేశ్, మాజీ సర్పంచ్ సదానందం, నాయకులు మహేందర్, అశోక్, సంతోష్, యువకులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య

మిషన్ భగీరథ నీరు వ్యవసాయానికి మళ్లింపు

కడెం, మార్చి 18 : నిర్మల్ జిల్లా కడెం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ సమీపంలో గల మిషన్ భగీరథ ఎయిర్‌వాల్ నుంచి 3హెచ్‌పీ నల్లటి పైపు వేసి వ్యవసాయ భూములకు నీటిని తరలిస్తున్నారు. అయితే గొల్లపెల్లి ప్రేమ్ సాగర్ అనే రైతుకు చెందిన వ్యవసాయ భూమిలో మిషన్ భగీరథ ఎయిర్‌వాల్‌ను గతంలో ఏర్పాటు చేశారు. దీని నుంచి కడెం మండలంలోని పలు గ్రామాలతో పాటు జన్నారం మండలానికి నీటి సరఫరా చేపడతారు. ఈ క్రమంలో రైతు గొల్లపెల్లి ప్రేమ్‌సాగర్ భూమిలో ఉన్న మిషన్ భగీరథ ఎయిర్‌వాల్ నుంచి పక్కనే ఉన్న ఓ ప్రభుత్వ ఉద్యోగి తన చేనులోకి నల్లటి పైపు ద్వారా నీటిని తరలిస్తున్నారని సంబంధిత రైతు ఆరోపించారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన నీటిని ఇలా వ్యవసాయానికి మళ్లించడం సరికాదని, వేసవిలో కింది ప్రాంతాల ప్రజలకు నీటిని అందించకుండా పొలాలకు తరలించడం ఏమిటని పలువురు వాపోతున్నారు. ఈ విషయమై సంబంధిత మిషన్ భగీరథ లైన్‌మెన్‌ను వివరణ కోరే ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులో లేదు. తాగునీటిని ఇలా వృథా చేయడం, అందులో ప్రభుత్వ అధికారిగా ఉండి ఇలా చేయడం సరికాదని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎయిర్‌వాల్ నుంచి పైప్ ద్వారా తరలిస్తున్న నీరు

విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలి

భైంసా, మార్చి 18 : విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం భైంసాలోని అల్ఫోర్స్ విద్యాసంస్థలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశంతో పాటు వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలను తెలుసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి

ఓటరు జాబితాలో అభ్యంతరాలు తెలపాలి

భైంసా, మార్చి18 : ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు, సవరణలు ఉంటే తెలపాలని ఆర్డీవో కోమల్ రెడ్డి అన్నారు. మంగళవారం భైంసాలోని తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. అలాగే కొత్త ఓటరు నమోదు చేసుకోవాలన్నారు.

అసెంబ్లీలో ఎడ్‌బిడ్ రోడ్డుపై చర్చ

ముథోల్, మార్చి 18 : నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో ఉన్న రోడ్డును కాంగ్రెస్ కార్యకర్తలు ఇష్టారీతిన తవ్వారని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ మంగళవారం అసెంబ్లీలో జీరో అవర్‌లో ప్రస్తావించారు. ఎడ్‌బిడ్ గ్రామంలో బస్టాండ్ బైపాస్ రోడ్డును కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్ కార్యకర్తలు తవ్వారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదని ఎమ్మెల్యే అసెంబ్లీలో ఆరోపించారు. దీంతో పాటు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆస్తిని ఇష్టారాజ్యంగా తవ్వడం సరికాదని, రోడ్డు తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఖానాపూర్ టౌన్, మార్చి 18: అక్రమంగా రవాణా చేసేందుకు నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఖానాపూర్‌లోని ఇందిరానగర్ కాలనీకి చెందిన కడమంచి లక్ష్మణ్ అమాయక ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి తన ఇంటి పరిసర ప్రాంతాల్లో నిల్వ చేసి ఉంచాడు. అందిన ఫిర్యాదు మేరకు దాడి చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇలా సేకరించిన బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరకు విక్రయించేవారన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

నార్నూర్, మార్చి 18 : గాదిగూడ మండలంలో తలెత్తిన సమస్యలు పరిష్కరించాలని రాయిసెంటర్ సార్‌మేడీలు మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజర్షి షాను మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. ఇక్కడ దౌలత్‌రావ్, జైవంత్‌రావ్, సోము, రాజు, శేఖర్‌బాబు, సంతోష్ ఉన్నారు.

రోగుల వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, మార్చి18 : రోగులకు సంబంధించిన వివరాలు ఈహెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్యాధికారి రాజేందర్ అన్నారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో వైద్యాధికారులు, నర్సింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈహెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయడంతో రోగులకు మెరుగైన సేవలను అందించవచ్చన్నారు. జిల్లా డాటా మేనేజర్ గంగాధర్, సబ్ ఇంజనీర్లు రమణ, సంతోష్ ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

జైనథ్, మార్చి 18: జైనథ్ మార్కెట్ కార్యాలయ ఆవరణలో చేపడుతున్న శనగ కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ మార్కెటింగ్ ఏడీ గజానన్ అన్నారు. శనగ రైతులు పాత కొత్త హమాలీలకు సంబంధించిన అంశంపై మంగళవారం ఏడీఏ ఇతర అధికారులతో కలిసి జైనథ్ మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత కొత్త హమాలీలు రైతులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి మోహన్, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి, జైనథ్ మార్కెట్ కార్యదర్శి దేవన్న, జైనథ్ సహకార సంఘం సీఈవో జీ గంగన్న, శనగ రైతులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

ఎదులాపురం, మార్చి 18 : తాగునీటి కార్యాచరణ ప్రణాళిక, భూగర్భ జలమట్టం మెరుగుదల చర్యల పై సంబంధిత జడ్పీ సీఈవో, డీఆర్డీవో, డీపీవో, డీఎల్‌పీవో, జేడీఏ, డీడీ భూగర్భ జలశాఖ, గ్రేడ్ ఈఈ, డీఈ, ఏఈ, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఈసీ అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా సమావేశం నిర్వహించారు. క్రిటికల్ హ్యాబిటేషన్‌లపై సమావేశం నిర్వహించి మండలాల వారీగా ఉన్న తాగునీటి సమస్యలపై ఆరా తీశారు. తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాను పటిష్టం చేయాలని, నీటి వనరులను గుర్తించాలని పలు సూచనలు సలహాలు చేశారు. ఈజీఎస్ కింద గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి కల్పించేందుకు ముందుకు వచ్చే ప్రతి గ్రామీణ కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల పని కల్పించాలన్నారు. ఎండల తీవ్రత రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో ఉదయం 6 నుంచి 11 గంటల వరకు పనులు చేసేలా చర్యలు చేపట్టాలని డీఆర్‌డీవోను ఆదేశించారు.

కవ్వాల్ పరిధిలోకి కొత్త విద్యుత్ లైన్

● విద్యుత్‌శాఖ అధికారి అరెస్ట్‌కు అటవీశాఖ అధికారుల యత్నం

నేరడిగొండ, మార్చి 18 : నేరడిగొండ విద్యుత్ శాఖ ఏఈ నాగేంద్ర ప్రసాద్‌ను అరెస్టు చేయడానికి అటవీశాఖ అధికారులు యత్నించిన ఘటన మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో మంగళవారం చోటు చేసుకున్నది. కవ్వాల్ టైగర్ జోన్ రేంజ్ అధికారి నాగనాథ్ స్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోవిందపూర్ సమీపంలోని కొంత అటవీ ప్రాంతం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉంది. అయితే ఇటీవల గ్రామ రైతులు సాగు కోసం కొత్త విద్యుత్ లైన్‌ను విద్యుత్‌శాఖ అధికారులు కేటీఆర్ పరిధిలో నిర్మించారు. అయితే కొన్ని రోజుల క్రితం కేటీఆర్ పరిధిలో వేసిన విద్యుత్ లైన్‌ను తొలగించాలని నేరడిగొండ విద్యుత్‌శాఖ ఏఈకి నోటీసులు అందించారు. అయిన వాటిని తొలగించక పోగా మంగళవారం అటవీశాఖ అధికారులు ఏఈని అరెస్ట్ చేయడానికి విద్యుత్‌శాఖ కార్యాలయానికి వచ్చారు. దీంతో అక్కడ కొంత టెన్షన్ వాతావరణం నెలకున్నది. అయితే అక్కడికి వచ్చిన విద్యుత్ శాఖ చీఫ్ ఇంజినీర్ జైవంత్‌రావ్ చౌహాన్ ఆదిలాబాద్ డీఎఫ్‌వో ప్రశాంత్‌పాటిల్‌తో ఫోన్‌లో మాట్లాడి రెండు రోజుల సమయం ఇస్తే విద్యుత్‌లైన్ తొలగిస్తామని తెలుపడంతో అటవీశాఖ అధికారులు తిరిగి వెళ్లిపోయారు. అరెస్టు పర్వం ఆగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

నేషనల్ మార్ట్‌లో చోరీ

ఎదులాపురం, మార్చి 18 : ఆదిలాబాద్ దస్నాపూర్‌లోని నేషనల్ మార్ట్‌లో చోరీ జరిగింది. దుండగుడు సోమవారం అర్ధరాత్రి మార్ట్‌లోకి చొరబడి అందులోని లాకర్‌ను పగలగొట్టి రూ.4.82లక్షలు దోచుకుపోయాడు. అంతేకాక సీసీ పుటేజీకి సంబంధించిన రెండు హార్డ్‌డిస్క్‌లు సైతం ఎత్తుకెళ్లాడు. మంగళవారం ఉదయం మార్ట్ సిబ్బంది, మేనేజర్ తుకారాం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ ఫణిధర్, మావల ఎస్ఐ విష్ణువర్ధన్‌లు అక్కడికి చేరుకున్నారు. సీసీ పుటేజీ పరిశీలించగా దుండగుడు ముఖాని స్క్రాప్, తలపై క్యాప్ వేసుకుని ఉండడంతో గుర్తు పట్టరాలేదు. దీంతో క్లూస్ టీం ,ఆధారాలను సేకరించింది. సీసీ పుటేజీ